# ఇందూరుకు గులాబీ బాస్

- ఉమ్మడి జిల్లాలో సీఎం సుడిగాలి పర్యటన
- బోధన్, అర్బన్, ఎల్లారెడ్డికి కేసీఆర్ రాక
- మూడు నియోజకవర్గాల్లో ప్రజాఆశీర్వాద సభలు
- భారీ ఏర్పాట్లు చేసిన స్థానిక ఎమ్మెల్యేలు



నగరంలోని జీజీ కళాశాలలో ఆశీర్వాద సభ వద్ద చేపడుతున్న ఏర్పాట్లు



నిజామాబాద్, నవంబర్ 14, (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నేడు (బుధవారం) ఉమ్మడి జిల్లాకు రానున్నారు. రెండో విడుత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒకే రోజు మూడు ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్ పాల్గొనబోతున్నారు. మొదటగా బోధన్ నియోజకవర్గానికి వస్తారు. ఇక్కడ జరిగే ప్రజా సభలో మధ్యాహ్నం ఒంటి గంటకు పాల్గొంటారు. 2 గంటల తర్వాత నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని ప్రచార కార్యక్రమానికి హాజరవుతారు. ఈ సభను గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ఇక్కడి సభ జరుగుతుంది. మధ్యాహ్నం 3గంటలకు కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరిగే ఎన్నికల ప్రచారానికి కేసీఆర్ హాజరవుతారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలను స్థానిక ఎమ్మెల్యేలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కేసీఆర్ చెప్పే విషయాలను స్వయంగా ఆలకించేందుకు జనాలు ఆసక్తితో ఉన్నారు. కేసీఆర్ రాక సందర్భంగా బోధన్, నిజామాబాద్ అర్బన్, ఎల్లారెడ్డి నియోజకవర్గల్లో గులాబీమయమైంది. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వస్తున్న సీఎం కేసీఆర్.. మూడు నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటన చేస్తారు. అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తారు.

**రేపు నిజామాబాద్ రూరల్‌కు..**

ఇప్పటి వరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను సీఎం కేసీఆర్ తన పర్యటనలతో దాదాపుగా చుట్టేశారు. బుధవారం జరగబోయే మూడు సభలతో ఉమ్మడి జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అధినేత ప్రచారం పూర్తయినట్లే. ఇక మిగిలింది నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం. ఇక్కడ కూడా గులాబీ బాస్ గురువారం పర్యటించనున్నారు. డిచ్‌పల్లి మండలం నడిపల్లి శివారులోని గాంధీనగర్‌లో ప్రజా ఆశీర్వాద సభకు స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ జనసమీకరణతో పాటు సభను విజయవంతం చేసేందుకు మండలాల వారీగా సమన్వయ సమావేశాలు నిర్వహించి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

మొదటి విడుత ప్రచారంలో భాగంగా జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో కేసీఆర్ టూర్ కొనసాగింది. ఆ తర్వాత నవంబర్ 2న బాల్కొండ, 3న ఆర్మూర్‌లో సభలు నిర్వహించారు. నవంబర్ 9న కామారెడ్డిలో నామినేషన్ వేసిన తర్వాత ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. తాను పోటీ చేస్తున్న నియోజకవర్గంలో దాదాపు పొద్దంతా ఉన్నారు. నాయకులతో సమావేశాలు, సమీక్షలు నిర్వహించారు. రెండో విడుత ప్రచారంలో ఒకే రోజు బోధన్, నిజామాబాద్ అర్బన్, ఎల్లారెడ్డిలో సీఎం పర్యటనలు ఉండగా, తెల్లారి నిజామాబాద్ రూరల్ టూర్‌తో కేసీఆర్ ఎన్నికల ప్రచారం ఉమ్మడి జిల్లాలో పరిసమాప్తం కానున్నది.

**రెపరెపలాడేది గులాబీ జెండానే..**

పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో రాజకీయ చైతన్యం, ఇప్పటివరకు సాధించిన అభివృద్ధిని తెలంగాణ ఉద్యమ నాయకత్వం పటిష్టం చేసే దిశగా అడుగులు వేస్తున్నది. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన శక్తులన్నీ ఏకమై మరోసారి తెలంగాణను మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయి. ప్రత్యేక రాష్ట్రం సాకారమైనప్పటికీ మళ్లీ అవే పాత్రలు వేర్వేరు డైలాగులు, వేషాలతో మరోసారి తెలంగాణపై దండయాత్రకు వస్తున్నాయి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఎన్నికలు ఏవైనా.. ఓటమి లేకుండా బీఆర్ఎస్ జైత్రయాత్రను కొనసాగించింది. ఇప్పుడు కూడా అదే తోవలో గులాబీ జెండా పయనిస్తున్నది. ఉద్యమ నేత కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ కల సాకారం అయ్యింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అందరి అనుమానాలు పటా పంచలు చేస్తూ వెలుగుల వైపు పరుగులు తీస్తున్నది. ఉద్యమ సమయంలో ఎగతాళి చేసిన వ్యతిరేక శక్తులతో నేడు తెలంగాణ మరోసారి ఆత్మగౌరవ పోరాటం చేస్తున్నది. ఎన్నికల్లో ఒక పార్టీ గెలవడం, మరో పార్టీ ఓడిపోవడం సాధారణమే.. కానీ, ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్నవి అలాంటి సాధారణ ఎన్నికలు కావు. కుట్రలు, కుతంత్రాలతో ముందుకు వస్తున్న కాంగ్రెస్, బీజేపీలు ఒక వైపు, ప్రాణాలకు తెగించి సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి పథంలో నడుపుతూ ఆదర్శంగా నిలిచిన కేసీఆర్ మరోవైపు. ఈ పోరులో గులాబీ జెండానే ఎన్నికల్లో రెపరెపలాడడం ఖాయమన్నది అనేక విశ్లేషణలు తేటతెల్లం చేస్తున్నాయి.

# బోధన్‌లో కేసీఆర్ సభకు ఏర్పాట్లు పూర్తి




బోధన్ శివారులోని సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు

బోధన్, నవంబర్ 14: పట్టణ శివారులో బుధవారం సీఎం కేసీఆర్ పాల్గొననున్న ప్రజా ఆశీర్వాద సభ కోసం సర్వం సిద్ధమైంది. వేలాదిమంది తరలి వచ్చే ఈ సభ కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. బోధన్ పట్టణ శివారులోని బోధన్ – నిజామాబాద్ ప్రధానరహదారి పక్కన అంబం గేట్ వద్ద విశాలమైన స్థలంలో ఈ సభను నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు బోధన్‌కు కేసీఆర్ రానున్నారు. సుమారు 70 వేల మందితో ఈ భారీ బహిరంగసభ నిర్వహించే దిశగా కొన్ని రోజులుగా బోధన్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్, బీఆర్ఎస్ నాయకులు కృషిచేస్తున్నారు. సభా ప్రాంగణం అంతటా కుర్చీలు వేశారు. తాగునీటి సౌకర్యంతో పాటు అత్యవసర వైద్యచికిత్స కోసం ఏర్పాట్లు చేశారు. సీఎం కేసీఆర్ హెలికాప్టర్ ల్యాండ్ అయ్యేందుకు వేదిక వెనుక భాగంలో హెలిప్యాడ్ నిర్మించారు. సభా ప్రాంగణం చుట్టూ కేసీఆర్, కేటీఆర్, కవిత ఫొటోలతో కూడిన భారీ కటౌట్లు, ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. సుమారు 70 వేల మందిని బోధన్ పట్టణం, వివిధ మండలాల నుంచి తరలించేందుకు బీఆర్ఎస్ నాయకులు క్షేత్రస్థాయిలో కృషిచేస్తున్నారు.

**బోధన్ - నిజామాబాద్ రహదారి పక్కన అంబం గేట్ వద్ద సభ**

**సభాస్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, సీపీ, పోలీస్ అధికారులు**

బోధన్‌లో సీఎం కేసీఆర్ పాల్గొనే ప్రజా ఆశీర్వాద సభాస్థలాన్ని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మంగళవారం పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లకు సంబంధించి పోలీస్ అధికారులతో ఆయన సమీక్షించారు. సీపీ వెంట అడిషనల్ డీసీపీ గిరిరాజ్, బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ ఉన్నారు. సీఎం రాక సందర్భంగా సభాస్థలం వద్ద భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సభాస్థలాన్ని సందర్శించి అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## సీఎం సభా ఏర్పాట్ల పరిశీలన



జిల్లాకేంద్రంలో సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బిగాల

ఖలీల్‌వాడి/ డిచ్‌పల్లి, నవంబర్ 14 : నగరంలోని గిరిరాజ్ కళాశాల గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించే సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లను బిగాల గణేశ్‌గుప్తా మంగళవారం పరిశీలించారు. సభ వద్ద చేయించాల్సిన ఏర్పాట్లపై నాయకులకు పలు సూచనలు చేశారు. బిగాల వెంట నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, సూదం రవి, సత్యప్రకాశ్, ముచ్కూర్ నవీన్, ఆర్ఎల్.నర్సింహ, కరిపె రాజు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి మండలకేంద్రంలోని గాంధీనగర్ వద్ద ఈ నెల 16వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాదసభ ఏర్పాట్లను రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్.. మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. సభాస్థలి వద్ద పూర్తి ఏర్పాట్లు చేయించాలని పార్టీ నాయకులకు సూచించారు. సభాస్థలికి కొద్ది దూరంలోనే సీఎం హెలిప్యాడ్ స్థలాన్ని సైతం ఆయన పరిశీలించారు. సభకు రూరల్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరానున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కృష్ణ, నయీం, ఒడ్డెం నర్సయ్య, అమీర్, అంజయ్య, రాజు, ఆసది రవీందర్ తదితరులు ఉన్నారు.



డిచ్‌పల్లిలో సభ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

## సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద సభను విజయవంతం చేయాలి

డిచ్‌పల్లి, నవంబర్ 14 : మండలకేంద్రంలోని గాంధీనగర్ వద్ద ఈ నెల 16న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 16న మధ్యాహ్నం ఒంటి గంటకు సభ ప్రారంభమవుతుందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. సభకు రూరల్ నియోజకవర్గం నుంచి 40 వేల మంది, డిచ్‌పల్లి మండలం నుంచి 10 వేల మందిని తరలిరానున్నారని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో సీనియర్ నాయకులు దాసరి లక్ష్మీనర్సయ్య, శక్కరికొండ కృష్ణ, విండో చైర్మన్ గజవాడ జైపాల్, పార్టీ నాయకులు దండుగుల సాయిలు, నీరడి పద్మారావు, రామకృష్ణ, రవికిరణ్, ఒడ్డెం నర్సయ్య, నల్లవెల్లి సాయిలు, అంజయ్య, ఫైజల్ పాషా, అజహర్, లొక్కిడి శంకర్, సూదం నాయక్, ప్రమోద్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు